

# నీవు వచ్చేవనీ...నీ పిలుపేవిని

– విజయరాణి కోడూరి

## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## సాధారణ బహుమతి పొందిన నవల

(గత సంచిక తరువాయి)

"**అయ్ లవ్ దెమ్ టూ** హేమ్. నీ నిర్ణయాన్ని గౌరవిస్తాను నేను" అంది.

"వారు వేసిన బాటలో పయనించేటపుడు ఈ బాటసారికి తోడుగా నడుస్తావా లతా?"

"నీ మనసులో నాకిచ్చిన స్థానమే నన్ను నీతో నడిపిస్తుంది హేమ్" అంది.

అంతలో పెద్ద అల వచ్చి వారి మీదనుంచి దాటుకుని వెళ్ళింది.

ఇద్దరూ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. లేచి, లతను చెయ్యిపట్టుకుని లేపాడు హేమంత్.

వారున్న పరిసరాలన్నీ మోకాలుపై కంటే నీరు చేరిపోయివుంది. వచ్చిన అల వెనక్కు వెళ్తూ పాదాల క్రింద ఇసుకను లాగేస్తుంది. లత హ్యాండ్ బాగ్‌ను మాత్రం పరిగెత్తి పట్టుకోగలిగాడు హేమంత్.

మరో పెద్ద అల వచ్చేస్తుంది. సూర్యుడు సముద్రం ఒడిలోకి చేరిపోతున్నాడు పూర్తిగా.

ఒక్కసారిగా అప్రమత్తమయ్యాడు హేమంత్.

"లతా పద" అంటూ పరుగుతీస్తున్నాడు లత చెయ్యి పట్టుకుని. నీళ్ళ అడుగున ఇసుకలోకి కూరుకు పోతున్న పాదాలను కష్టంగా లాక్కుంటూ పరుగు తీస్తున్న వారిని ఇంకా రెండు మూడు అలలు పూర్తిగా ముంచెత్తాయి. లత చేతిని మరింత గట్టిగా పట్టుకున్నాడు అతడు.

"ఈ రోజు అమావాస్య అనుకుంటాను" అన్నాడు.

లత చీర అతుక్కుపోయి అడుగు పడటంలేదు. వెనక్కు ఉండిపోయిన లత చెయ్యి హేమంత్ చేతిలోంచి జారిపోయింది. నీళ్ళలో పడిపోయింది లత. మరొక పెద్ద అల వస్తుంది వేగంగా. హేమంత్ ఆమెను చేతుల్లో ఎత్తే ప్రయత్నం చేస్తున్నాడు గాభరాగా.

"లతా!" బిగ్గరగా అరిచాడు హేమంత్. అతడి మనసు ఉలిక్కిపడింది. కంగారుగా లేచి కూర్చున్నాడు. చదువుతూ గుండెపై ఉంచుకున్న డైరీ జారిక్రింద పడిపోయింది. అతడి గుండె వేగంగా స్పందిస్తుంది. చుట్టూ చూసాడు. సముద్రంలేదు. లతా లేదు. తన రూములో ఉన్నాడు.

మసక చీకటిగా వుంది. గొంతు ఎండిపోతుంది.

నెమ్మదిగా ఫ్రిజ్ దగ్గరకు వెళ్ళి ఒక వాటర్ బాటిల్ తెచ్చుకుని తాగాడు. అతడి మనసు మళ్ళీ వెనక్కు పరిగెత్తింది.

లత నీళ్ళలో పడిపోయింది. తను ఆమెను చేతులతో ఎత్తుకుని పడుతూ లేస్తూ కారు దగ్గరకు చేరుకున్నాడు. లతను బ్యాక్ సీట్‌లో కూర్చోబెట్టాడు. ఆమె చలికి షివర్ అవుతుంది. "అయ్యో బాగా తడిసిపోయారు. ఒక్క నిమిషం ఆగండి సార్" అంటూ పరుగున ఒక టవల్ తెచ్చి ఇచ్చాడు సెక్యూరిటీ గార్డ్.

"కొంచెం రెండు కప్పుల వేడి కాఫీ తెప్పించి పెట్టగలవా?" అంటూ అతడికి పర్సులోంచి తడిసిన అయిదు వందల నోటు ఇచ్చాడు. అతడు సెక్యూరిటీ రూములోకి వెళ్ళి ఫోన్ చేసి వచ్చాడు,

"తెస్తున్నాడు సార్" అంటూ.

టవల్ లతకు అందించాడు "తల తుడుచుకో లతా. కాఫీ వస్తుంది తాగేసి బయలుదేరిపోదాం" అన్నాడు.

కాఫీ తాగి బయలుదేరారు. సెక్యూరిటీ ఛేంజ్ పట్టుకుని "సార్...సార్" అంటూ పరుగున వచ్చాడు. చిల్లర ఇవ్వబోయాడు. "తీసుకో. థ్యాంక్స్" అంటూ ముందుకు పోనిచ్చాడు కారును.

లతను హాస్టల్ దగ్గర డ్రాప్ చేసి వెనుతిరిగాడు తను.

చెమర్చిన కళ్ళతో "బై హేమ్." అని చెప్పి కారు దిగి వెళ్ళిపోయింది లత.

నా శరీరాన్ని వదిలి ప్రాణం వెళ్ళిపోతున్న ఫీలింగ్ మనసులో. మరుసటి రోజు నోట్ బుక్స్ తీసుకెళ్ళి లతకు ఇచ్చాడు తను, "ఇవి చదువుకో చాలు. నేనూ అవే ఫాలో అయ్యేవాడిని" అంటూ.

ఆ సమయంలో ఇద్దరికీ మాటలు కరువయ్యాయి.

"అలాగే" ఆంది దుఃఖాన్ని ఆపుకుంటూ లత.

మౌనంగా ఆమె చేతిని చేతిలోకి తీసుకుని మృదువుగా నొక్కి వదిలేసాడు. వెను తిరిగి పరుగున మెట్లెక్కి వెళ్ళిపోయింది లత. బైక్ స్టార్ట్ చేస్తూ పైకి చూసాడు కిటికీ వైపు. చూస్తూ నిలబడిన లత చెయ్యి ఊపింది.

తిరిగి చెయ్యి ఊపి వేగంగా బైక్ స్టార్ట్ చేసుకు వెళ్ళిపోయాడు భారమైన గుండెతో.

ఆ మరుసటి రోజు తను ఆగ్రాకు, లత కర్నూలుకు బయలుదేరబోతున్న తరుణంలో ఆ రాత్రే జరగకూడనిది జరిగిపోయింది. లత నాన్నగారు పోయారు అన్న వార్త.

జీవితానికి ఒక అందమైన రూపాన్నిచ్చి మలుచుకుంటున్న సమయంలో ఆ పిడుగులాంటిసంఘటనతో ఇద్దరిమనసులు అశాంతికి గురయ్యాయి.

ఇదంతా జరిగి ఇన్ని రోజులైనాగాని, నిన్నా మొన్న జరిగినట్లు మనసుపై ముద్రించుకుపోయింది. బాధగా ముఖం రుద్దుకున్నాడు అరిచేతులతో హేమంత్.

టీపాయ్ మీదున్న మూత పెట్టని వాటర్ బాటిల్‌ను అందుకోబోయాడు. అది పడిపోయి ఒలికిపోయాయి నీళ్ళు.

కంగారుగా టీపాయ్ మీద ఉన్న పేపర్లను, మ్యాగ్‌జైన్‌లనూ తీసి సోఫాలో పెట్టాడు. మసక చీకటిగా ఉంది. లైట్ స్విచ్ ఆన్ చేసాడు. సోఫా దగ్గర క్రింద నేల మీద పడిన డైరీని తీసి పైన పెట్టాడు. టీపాయ్ మీద ఒక కవరు ఉంది ఇంకా. అది కూడా తీసాడు. 'ఇందాక లత డైరీలోంచి జారిపడింది ఈ కవరేనా?' అనుకున్నాడు హేమంత్.

నెమ్మదిగా సోఫాలో ముందుకు జరిగి ఆ కవర్‌ను పరిశీలనగా చూసాడు. నాలుగు మూలలా పసుపు అయి ఉండవచ్చు కాని అది పాతబడిపోయి లైట్ బ్రౌన్ కలర్‌లోకి మారి ఉంది. అతడి కనుబొమలు ముడిపడ్డాయి. నెమ్మదిగా కవర్ తెరిచి చూసాడు. లోపల ఉన్న కార్డును తీశాడు. కార్డ్ ఫోల్డ్ చేసి ఉంది. ఓపెన్ చేశాడు హేమంత్.

అతడి గుండె ఝల్లు మంది ఒక్కసారిగా.

'డాక్టర్ కిరణ్ యు.కె వెడ్స్ లత' అని ఉంది.

కంపిస్తున్న వేళ్ళతో కళ్ళకు దగ్గరగా పెట్టుకుని చూశాడు మళ్ళీ.

'అది లత పెళ్ళి శుభలేఖ.'

జీర్ణించుకోలేకపోయింది అతడి మనసు.

'అరుణ్, లతకు పెళ్ళి అయిపోయిందంటే తన మనసు నమ్మలేదు.'

కార్డు అతడి చేతిలో నుంచి జారిపడిపోయింది. ప్రాణం లేనట్లు సోఫాలో వెనక్కు చేర్లబడిపోయాడు.

అతడు ఏదో గుర్తుకు వచ్చినట్లు మళ్ళీ ఒక్క ఉదుటున లేచి క్రిందపడిన కార్డును చేతిలోకి తీసుకున్నాడు.

డేట్, ఇయర్ చూసాడు పరిశీలనగా.

డిసెంబర్ 15, 2019 అని వుంది.

అతడి గుండె స్పందన పెరిగింది.

'అలా ఎలా?' అదే ప్రశ్నతో మతిపోయినట్టుంది అతడికి. మనసులో ఆలోచనలు గజిబిజిగా పరుగులు తీస్తున్నాయి. చేతి వేళ్ళను జుట్టులోకి పోనిచ్చి తలను రుద్దుకున్నాడు గట్టిగా. అప్రయత్నంగా "ఆ!" అన్న కేక వెలువడింది అతడి నోటినుంచి.

"అంటే, అరుణ్‌ను తను కర్నూలుకు పంపించింది ఎప్పుడు? నమ్మశక్యంగా లేదతడికి. అరుణ్ వెళ్ళింది సెప్టెంబర్, 2017లో కదా! ఎలా చెప్పాడు అలా?

అప్పటికి అమ్మ, నాన్నగారూ మాయమై పోయి కొన్ని నెలలైంది . వీల్ చెయిర్ కు మారింది జీవితం. కాలుకు మళ్ళీ ఆపరేషన్ అన్నారు. ఆలోగా వచ్చేయాలని అరుణ్, తన బర్త్డే, ఆ రోజే బయల్దేరి వెళ్ళాడు కర్నూలు. తనకు బాగా గుర్తుంది. అది సెప్టెంబర్ 14, 2017.

రెండు సంవత్సరాలకు మందే అరుణ్ చెప్పింది నిజం కాదా?ఏమిటి ఈ మాయ? మతిపోయేలా వుంది!'

వెంటనే లేచి సెల్ కోసం చూశాడు. అది వెంటనే కనిపించలేదు. దాని కోసం బెడ్ మీద తలగడలు, సోఫాలలో పిల్లోస్ అన్నీ విసిరి పడేసాడు. అపుడు డైనింగ్ టేబుల్ మీద కనిపించింది.

తీసి అరుణ్కి రింగ్ చేశాడు.

అతడు "హలో" అనగానే,

"నువ్వు వెంటనే పైకి రా" అన్నాడు.

"ఎందుకురా? ఒక కేస్ చూస్తున్నాను,అవగానే వస్తాను."

"ఎవ్వర్నైనా చూడమను. నువ్వు రా" అంటూ కట్ చేశాడు. వెళ్ళి సోఫాలో కూలబడ్డాడు.

తలుపు నెట్టుకుని అరుణ్ వచ్చాడు.

చిందర వందరగా పడివున్న తలగడలు, సోఫాలో పిల్లోలు బెడ్షీటు చూసి, హేమంత్ వైపు విస్మయంగా చూసాడు.

అరుణ్ వైపు చికాగ్గా చూసాడు హేమంత్.

అంతకు ముందెన్నడూ చూడని విధంగా వుంది హేమంత్ మూడ్.

నేలమీద వున్న తలగడ, బెడ్షీటు తీసాడు.

"నిన్ను అవన్నీ సర్దటానికి పిలవలేదు. ఇలా వచ్చి కూర్చో."

అరుణ్ చేతిలో తలగడను బెడ్పై పడేసి వచ్చాడు.

"అసలు ఏమైందిరా?" అన్నాడు కూర్చుంటూ.

"అది చెప్పవలసింది నువ్వు." అంటూ వెడ్డింగ్ కార్డును టీపాయ్ మీదకు విసిరి కొట్టాడు హేమంత్. తీసి చూసిన అరుణ్ గుండె లయ తప్పింది.

"అవునూ, ఇది మనకు తెలిసిన విషయమేగా." అన్నాడు.

"అవునా? దానిపై డేట్ చూసి చెప్పు, అది నీకు తెలిసిన విషయమో, నాకు తెలిసిన విషయమో?"

"అర్థం కాలేదు"అన్నాడు అరుణ్.

"నిన్ను లత దగ్గరకు వెళ్ళమని పంపాను ఎపుడు?"

అపుడు విషయం పూర్తిగా అర్థమైంది అరుణ్కు.

అతడు తడబడటం చూసిన హేమంత్, "నేను చెప్పనా? ఆ రోజు, నీ బర్త్‌డే. సెప్టెంబర్ 14. అది 2017 అవునా?" అన్నాడు.

"అవును" అన్నాడు అరుణ్.

"ఎందుకిలా చేశావ్?" తీవ్రంగా ఉంది హేమంత్ స్వరం.

"అదంతా జరిగిపోయిన గతంరా. ఇపుడూ తవ్వుకోవటం ఎందుకు?" లోలోపల బెరుకుగానే ఉన్నాగాని పైకి బింకంగా అన్నాడు అరుణ్.

"ఎందుకిలా చేశావ్? ఎవరు చెప్పమన్నారు అలా? లతా?" బిగ్గరగాఅరిచాడు హేమంత్.

అదిరిపడిన అరుణ్ విస్మయంగా చూశాడు హేమంత్ ముఖంలోకి. మౌనంగా ఉండిపోయాడు అరుణ్. ఎలా చెప్పాలో, చెపితే హేమంత్ ఎలా స్పందిస్తాడోనని భయంగా ఉంది అతడికి.

"మళ్ళీ ఏం కల్పించి చెప్దామా అని ఆలోచిస్తున్నావా?"

"అసలెందుకు ఇలా మాట్లాడుతున్నావ్ హేమంత్?"

"ఎందుకో నీకు తెలుసు. ఆ కార్డులో డేట్ చూడరా. 2019లో జరిగిన పెళ్ళిని నువ్వు రెండేళ్ళు ముందుగానే ప్రెడిక్ట్ చేసి చెప్పావా?"

"అదీ..." అరుణ్‌కు మధ్యలోనే అడ్డు వచ్చాడు.

"2017లోనే పెళ్ళి అయిందని ఎలా చెప్పావ్? అదొక్కటేనా? లత లండన్‌కు వెళ్ళిపోయిందనీ, బిల్డింగ్ లాక్ చేసేసి ఉందన్నావ్. వాళ్ళ మదర్ అన్నగారి ఇంటికి వెళ్ళిపోయిందని చెప్పావ్. ఇన్ని అబద్ధాలా?"

"అవును చెప్పానురా.. ఎవరి కోసమో..."

మధ్యలోనే అడ్డు వస్తూ అరిచాడు హేమంత్.

"షటప్ అరుణ్. జస్ట్ షటప్.."సోఫాలో వెనక్కు చేర్లబడి కళ్ళుమూసుకున్నాడు కాసేపు.

కళ్ళు తెరిచి అరుణ్ ముఖంలోకి సూటిగా చూశాడు.

"నువ్వేం చేసావో నీకు అర్థమవుతుందా?" నెమ్మదిగానే అడిగాడు. చూపులను మరల్చుకున్నాడు అరుణ్.

"ఏంటీ? అయిపోయిన గతాన్ని తవ్వుకుటున్నానా? నువ్వు కదురా, నిలువులోతు గొయ్యి తీసి మా ప్రేమను పాతేసావ్? నన్ను.. నన్ను మోసం చేస్తావా? నిన్ను ఎంత నమ్మానురా? ఎందుకురా ఇంత అపకారం చేశావ్ నాకు?" హేమంత్ స్వరం గద్గదమైంది.

అరుణ్ లేచి హేమంత్‌కు దగ్గరగా వచ్చి కూర్చున్నాడు.

"హేమంత్, నువ్వు నా నిజాయితీకి పరీక్ష పెట్టక్కర్లేదు. నేనే చెప్తాను ఏం జరిగిందో." అన్నాడు.

"నిజం! నువ్వు చెప్పేది నిజం అని నమ్మదురా నా మనసు. ముందే చెప్తున్నాను, అక్కడేం జరిగిందో ఉన్నది ఉన్నట్టు చెప్పు. ఇపుడు కూడా మరో కొత్త కథ అల్లి నన్ను నమ్మించాలని చూడకు. అలా చేస్తే, ఆ క్షణమే నీకు హేమంత్ గతంలో కలిసిపోతాడు"

"అలాగా? అయితే నేను చెప్పేది కూడా విను. హేమంత్ ఉండకపోతే ఈ అరుణ్ ఒక్క క్షణం కూడా ప్రాణాలతో వుండదురా. నీ తర్వాతే, నాకు.. నేనూ, నా భార్యా, కొడుకు నా బ్రతుకు అన్నీ కూడా."

ఉద్వేగానికి గుర్రై షర్ట్ చేత్తో కళ్ళు తుడుచుకున్నాడు అరుణ్.

అరుణ్ చెప్పటం మొదలు పెట్టాడు హేమంత్‌కు.

"నీకు లత ఫోన్ కలవటంలేదు. వేరే సెల్స్‌తో కూడా అనేకసార్లు ప్రయత్నించాం. అటునుంచి ఏ స్పందనా లేదని నువ్వు పడుతున్న ఆందోళన, బాధ చూడలేకపోయేవాడిని.

"నువ్వింకా కదలలేని పరిస్థితిలోనే ఉన్నావ్ ఢిల్లీ హాస్పిటల్‌లో. అప్పటికే నీ కాలుకు మూడు సర్జరీలయ్యాయి. డాక్టర్లు నాలుగవసారి మరొక్క సర్జరి చేస్తామని చెప్పారు. అది సక్సెస్ అయితే నువ్వు నడవగలవనీ, లేకుంటే కేవలం సపోర్ట్స్‌తో మాత్రమే నడవగలవనీ చెప్పారు." ఆగాడు అరుణ్.

"డాక్టర్‌గా అది నేను ఊహించానులే. దయచేసి నాకు తెలియని విషయాలే చెప్పు. నన్ను ఇరిటేట్ చెయ్యవద్దు. నా మెంటల్ కండిషన్ బాగోలేదు. చాలా అసహనంతో ఉంది నా మనసు." కళ్ళు మూసుకునే చెప్పాడు హేమంత్.

"కర్నూలుకు చేరుకున్నాను. లత వాళ్ళ బిల్డింగ్ చుట్టూ పెద్దగా సెక్యూరిటీ ఉంది. ప్రహరీ గోడలపై పవర్ వైర్స్‌తో సెక్యూరిటీ వుంది. పెద్ద గేటు లోపల, వెలుపల బిల్డింగ్ చుట్టూ, మనం సినిమాలలో చూస్తాం. అటువంటి రఫ్‌గా ఉన్న, కండలు తిరిగిన రౌడీల లాంటి వాళ్ళు చాలామంది ఉన్నారు.

నెమ్మదిగా గేటు వరకు వెళ్ళాను. ఒక్కసారిగా కుక్కలు భీకరంగా మొరగటం మొదలు పెట్టాయి. నాలుగో అయిదో ఉన్నాయి బలమైన గొలుసుతో కట్టి, అవి సైజులో చాలా పెద్దగా ఎత్తుగా ఉన్నాయి.

అందులో ఒకడు నాకు దగ్గరగా వచ్చాడు "ఎవరు?" అంటూ.

లతగారు చదివే కాలేజీ వాళ్ళు పంపించారని చెప్పాను. ఆమెతో మాట్లాడాలి అని చెప్పాను.

కుక్కలు భయంకరంగా మొరుగుతూనే ఉన్నాయి. అంతలో పైన బాల్కనీలోకి ఒక వ్యక్తి వచ్చాడు. చూడటానికి చాలా క్రూరంగా కనిపించాడు అతడు.

"ఎవర్రా?" బిగ్గరగా అడిగాడు.

నన్ను "చెప్పు. అడుగుతుండాడు కదా" అంటూ ముందుకు నెట్టాడు ఒకడు.

"లతగారు చదివే కాలేజీనుంచి వచ్చాను సార్." అన్నాను.

"అదే, ఎందుకొచ్చినావ్ అబ్బీ?"పెద్దగా అరిచాడు.

నాకు లోపల చాలా కంగారుగా భయంగా వుంది.

తడుముకుంటూ చెప్పాను. "లతగారు పరీక్షలు రాయటానికి రాలేదు. ఎందుకు రాలేదో కనుక్కోమని నన్ను పంపించారు. ఆవిడ సెల్ కలవటం లేదట సార్."

"లత ఇకరాదుగానీ, నువ్వు ఫో." అనాడు.

"సార్ ఒక్కసారి లతగారితో మాట్లాడి రమ్మన్నారు." అన్నాను.

అతడు" ఒరేయ్ పెద్ద మసేనూ." అని పిలిచాడు.

"అయ్యా." అంటూ పరుగున ముందుకు వెళ్ళాడు ఒకడు.

"ఆడు మళ్ళీ ఈ చుట్టుపక్కల కనపడకూడదు. అసలు కర్నూలులోనే కనిపించకూడదు. కనిపిస్తే ముక్కలుగా నరికేసి కుక్కలకు వేసేయండి." అంటూ వెళ్ళిపోయాడు. అంతే నా మీద బలప్రయోగం మొదలైంది.

"ఇన్నావుగా ఏం చెప్పాడో. మా కుక్కలు మంచి ఆకలిమీద ఉండాయి. ఎక్కడ్నుంచి వచ్చావో అక్కడకు తక్షణమే పోరా." అంటూ, నన్ను చేతులు ఒకడు, కాళ్ళు ఒకడు పట్టుకుని ఒక మూటను విసిరినట్టు దూరంగా విసిరిపడేసారు.

నా కాళ్ళూ చేతులు కొట్టుకుపోయి రక్తం వస్తుంది. నెమ్మదిగా లేచి చాలా దూరం నడిచి, పోయి ఒక చెట్టు చాటుగా కూలబడ్డాను.

నా బాధకంటే కూడా నా రాక కోసం ఎదురు చూసే నీకు ఏం చెప్పాలో అన్న బాధ ఎక్కువైపోయింది.

ఆ సమయంలో ఒక పెద్దావిడ వచ్చింది అక్కడకు. ఆమె తలపై కనిపించకుండా కొంగు కప్పుకుంది. అక్కడున్న పొదల చాటున కూర్చుంది.

నేను ఎలర్ట్ అయి చూస్తుంటే ఆవిడ, "భయపడకయ్యా. నేను లతమ్మ ఇంటి పనిమనిషిని." అని చెప్పింది.

ఆమె, చుట్టూ భయం భయంగా చూసుకుంటూ మాట్లాడుతుంది.

"బిడ్డా నేను చెప్పేది జాగ్రత్తగా ఆలకించుకో, నువ్వెవరో, ఎందుకొచ్చావో నాకు తెలియదు. నిన్ను చంపకుండా వదిలినందుకు పారిపోకుండా ఇక్కడ కూర్చున్నావేంటి? బతకాలని లేదా?"

"ఒక్కసారి లతను చూసి మాట్లాడాలమ్మా. ఎలా?" అన్నాను.

"ఆళ్ళు రక్తం తాగే రాక్షసులు. ఇలా నీతో మాట్లాడటం చూస్తే, నా తల, నీ తల కూడా తెగిపడతాయి బిడ్డా. లతమ్మను కలవటం అన్నది జరగదు. నిన్నూ నన్నూ కూడా ముక్కలు చేసి కుక్కలకు తినిపిస్తారు. బిడ్డా నా మాట విని ఈ దారమ్మటే ఎళిపో. బస్టాండ్ వస్తది. ఫో,పోయి బతికిపో." అంటూ లేచింది ఆమె.

"అమ్మా లత ఎలా వుంది? బాగుందా? కనీసం అదైనా తెలుసుకుని పోతాను." అన్నాను.

"లతమ్మ చిన్నప్పటి కాడనుంచి ఆ ఇంట్లో ఉండాను నేను. ఏం చెప్పమంటావయ్యా? ఇందాకా పై నుండి అరిచేడే వాడే లతమ్మ మేనమామ నరోత్తమ రెడ్డి. పచ్చి నెత్తురు తాగే రాక్షసుడు ఆడు..

ఎక్స్ పార్టీలో చేరి లతమ్మ తండ్రిని హత్య చేశాడు. ఇప్పుడు తల్లిని, కూతుర్ని ఖైదులో ఉంచినట్టు ఉంచాడు. లతమ్మ వెనకాల కోట్ల ఆస్తులున్నాయి. అవి కావాలి ఆడికి. తన కొడుకు లండన్‌లో డాక్టరంట, ఆడికి లతమ్మనిచ్చి పెళ్ళిచేస్తాడంట, ఆడింకా రాలేదు.

"లతమ్మ అతగాడి కాళ్ళు పట్టుకుని బ్రతిమలాడింది. తన చదువు పూర్తిగా చదువుకోనిమ్మని. కాలితో నెట్టి పడేసాడు ఆ బిడ్డను. 'నా కోడలయ్యేక చదువుకో పోయి.' అన్నాడు.

"లతమ్మ తండ్రి పోయినపుడు, లతమ్మ వెంట ఒక పిల్లగాడు వచ్చాడు; ఆ అబ్బాయినే పెళ్ళి చేసుకుంటాను, నాఆస్తులన్నీ తీసేసుకో మామా, నన్ను వదిలేయ్ అని ఎంతో బతిమాలుకుంది. ఎంటనే ఆ రౌడీలను పిలిచి వైజాగట పంపేడు.

'లతమ్మతో ఒకడొచ్చినాడు కదా. ఆడిని చంపేసి, సముద్రంలో చేపలకు ఏసేయండిరా పోయి.' అని పంపాడు. లతమ్మ తల్లి యశోదమ్మ కూడా అతడి కాళ్ళు పట్టుకుంది పాపం.

' అన్నా నా బిడ్డను వదిలేయి' అని బతిమలాడింది. కూతురి తరపున మాట్లాడిందని మెట్ల పై నుంచి తోసేసాడు. ఆమెను కూతురు దగ్గర లేకుండా వేరేచోట పెట్టాడు. ఆమె, చావు కోసం ఎదురు చూస్తుంది మూలన పడి. కళ్ళు ఒత్తుకుంటూ, ' ఎలిపో బిడ్డా. నే పోతన్నా.' అంటూ లేచింది.

"చిన్నచీటీ ఇస్తాను, లతకు ఇమ్మని అడిగాను. లేకపోతే ఒకమాటైనా చెప్తావా? అని అడిగాను."

ఆమె మళ్ళీ కూర్చుంది 'దేముడా' అంటూ.

"వద్దు బిడ్డా లతమ్మ చచ్చో బతికో బతికైనా ఉందిపుడు. చిన్నప్పుడు ఈ చేతులతో ఎత్తుకున్న బిడ్డ లతమ్మ. ఆ ప్రేమతోనే కంటికి రెప్పలా  చూసుకుంటుండాను. నా మీద అనుమానం వస్తే ఆ బిడ్డ కన్నీరు తుడిచే దిక్కు కూడా ఉండదు. నన్ను చంపేస్తాడు.'

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS